సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



వెంకటాంపల్లి చిన్నతండాకు చెందిన వలంటీర్ కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ. చిత్రంలో పైలా



మూలగిరిపల్లిలో తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ. చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

ఉరవకొండ: ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం ఆర్‌ఎఫ్) చెక్కులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరుపేద కుటుంబాలకు భరోసా ఇస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న అన్నారు. మండలంలోని మూలగిరిపల్లిలో జరిగిన సభలో నియోజకవర్గంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వారు పంపిణీ చేశారు. వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి చిన్నతండా గ్రామానికి చెందిన వలంటీరు రమావత్ సురేష్ నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. ప్రభుత్వం వలంటీరు కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ. 5 లక్షలు మంజూరు చేసింది. ఈ చెక్కును సర్పంచ్ భూమ కమలమ్మ ఆధ్వర్యంలో మృతుడి భార్య లలితకు మాజీ ఎమ్మెల్యే అందించారు. అలాగే ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన బెస్త బసవరాజు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. ఆ కుటుంబానికి మంజూరైన రూ. 3 లక్షల చెక్కును బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, ఆమిద్యాల నాయకుడు తేజోనాథ్ ఆధ్వర్యంలో చెక్కు పంపిణీ చేశారు. బెళుగుప్ప మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డికి రూ.70 వేలు, బెళుగుప్ప మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన సుంకమ్మకు రూ.60 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బెళుగుప్ప నాయకులు వెంకట్‌రెడ్డి, ధనంజయ, ఉరవకొండ నాయకులు ఓబన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ నీటి కష్టాలకు చెక్

కీళ్ల నొప్పులతో అవస్థలు పడే మూలగిరిపల్లివాసులకు ఇకపై ఫ్లోరైడ్ సమస్య ఉండబోదని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింగయ్య అన్నారు. ఆదివారం మండలంలోని మూలగిరిపల్లిలో టాటా విండ్ పవర్ కంపెనీ సౌజన్యంతో నిర్మించిన తాగునీటి వాటర్ ప్లాంట్‌ను మాజీ ఎమ్మెల్యే ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మూలగిరిపల్లి ఓబన్న, సర్పంచ్ శ్రీరాములు అధ్యక్షతన జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మూలగిరిపల్లిలో ఫ్లోరైడ్ బారినపడి ఎంతో మంది చిన్న వయస్సుల్లోనే నడవలేని దుస్థితిలో ఉన్నారని, దీన్ని అరికట్టేందుకే టాటా విండ్ పవర్ కంపెనీ సహకారంతో రూ.2 లక్షల మండల పరిషత్ నిధులతో దాదాపు రూ.10 లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టాటా విండ్ ఎనర్జీ ప్రతినిధులు సుధాకర్, రామన్నగౌడ్, ప్రకాష్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వీరన్న, ఎంపీపీ, వైఎస్ ఎంపీపీలు చంద్రమ్మ, నరసింహులు, జెడ్పీటీసీ పార్వతమ్మ, కమ్మ, బెస్త, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు తేజోనాథ్, రమణ, గోవిందు, వెంకటేష్, పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, ఉప సర్పంచ్ వెంకటరెడ్డి, ఎంపీటీసీ ఓబయ్య, మూలగిరిపల్లి బసవరాజు, ఎర్రిస్వామిరెడ్డి, నాగరాజు, ఉలిగన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓటరు సర్వే పక్కాగా నిర్వహించండి



సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్ బాలకిషన్

బ్రహ్మసముద్రం: మండలంలో ఇంటింటా ఓటరు సర్వేను పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ బాలకిషన్ బీఎల్‌ఓలకు సూచించారు. ఆదివారం మండలంలోని చెలిమేపల్లి, బుడిమేపల్లి, కన్నేపల్లి గ్రామాల్లో బీఎల్‌ఓల ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. త్వరగా సర్వే పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో కొత్త ఓటర్లను నమోదు చేయించాలని, మృతి చెందిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు లక్ష్మన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



వన్నూరుస్వామిని పరామర్శిస్తున్న కాపు భారతి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

బొమ్మనహాళ్: మండలంలో ఉప్పరహాళ్ గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన హత్యాయత్నంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వన్నూరుస్వామి, తిప్పేస్వామి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆదివారం రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కూతురు డాక్టర్ సప్రంతి రెడ్డితో కలిసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. చికిత్స నిమిత్తం రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వర‌రెడ్డి, సర్పంచ్ యోగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరియదాసు సేవలు మరువలేనివి

కంబదూరు: ఉపాధ్యాయుడు మరియదాసు సేవలు మరువలేనివని సర్పంచ్ సంధ్య, పాస్టర్ ఎజ్రా, సీ అండ్ ఐజీ మిషన్ చర్చి సంఘ పెద్దలు కొనియాడారు. గత కొన్నేళ్లుగా మండలంలో మరియదాసు ఉపాధ్యాయుడిగా పని చేసి ఇటీవల బదిలీ అయ్యారు.ఆదివారం స్థానిక సీఅండ్‌ఐజీ మిషన్ చర్చిలో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు స్వామిదాసు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు సత్కారం



రిజ్వాన్‌బాషను సత్కరిస్తున్న కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయదుర్గంటౌన్: ఉమ్రా యాత్ర(మక్కా, మదీన)కు వెళుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వలిబాషా కుమారుడు రిజ్వాన్‌బాషా కుటుంబ సభ్యులను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ నెల 17న రిజ్వాన్‌బాషా కుటుంబ సభ్యులు బెంగళూరు నుంచి 15 రోజుల పాటు ఉమ్రా యాత్రకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వలిబాషా ఆత్మీయ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విచ్చేసిన కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు రిజ్వాన్‌బాషాను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, కౌన్సిలర్లు శ్రీలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, ఫక్రుద్దీన్, కోఆప్షన్ సభ్యుడు నజీర్, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, గోల్డ్ ఇస్మాయిల్, బషీర్ అహ్మద్, నిజాముద్దీన్, భీమనపల్లి దివాకర్, రామాంజనేయులు, మాజీ కౌన్సిలర్ గోనబావి సర్మాస్, డి.హీరేహాళ్ రహంతుల్లా, రఫీక్ అహ్మద్, మెప్మా సమాఖ్య అధ్యక్షురాలు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలాలు





టీచర్ శాంతి, ఎన్నికల డీటీ వెంకటేశులు ఇంటి పెరట్లో విరిసిన బ్రహ్మకమలాలు

కళ్యాణదుర్గం: పట్టణంలోని పార్వతి నగర్‌లో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు శాంతి, శివకుమార్ ఇంట్లో శనివారం రాత్రి బ్రహ్మకమలాలు విరబూశాయి. విషయం తెలుసుకున్న స్థానికులు బ్రహ్మకమలాలను తిలకించేందుకు తరలివచ్చారు. అలాగే రెవెన్యూ కాలనీలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశులు పెరట్లో మొట్టమొదటి సారిగా బ్రహ్మకమలం పూయడంతో ఆనందం వ్యక్తం చేశారు.

నేడు 'నా భూమి-నా దేశం'

రాయదుర్గంటౌన్: ఆజాదికా అమృత్ మహోత్సవ్ సందర్భంగా సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నా భూమి–నాదేశం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ఆధ్వర్యంలో శిలాఫలకం ప్రారంభం, ప్రతిజ్ఞ, భూమికి వందనం, వీరులకు వందనం, జెండా ఎగురవేసే కార్యక్రమం జరుగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

'కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి'

కళ్యాణదుర్గం: కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్ సూచించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్‌తో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఉద్యోగులకు 12వ పీఆర్సీని ప్రకటించాలని లేనిపక్షంలో ఐఆర్‌ను ఇవ్వాలన్నారు. స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగవేణి, నాయకులు నరసింహులు, చిట్టి, సుగుణ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు పాల్గొన్నారు.

గోవిందరాజులు నుంచి ప్రాణహాని ఉంది



మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు విశ్వనాథ్, ఆర్యవైశ్యులు

కళ్యాణదుర్గం: ఆర్యవైశ్యం సంఘం ఉపాధ్యక్షుడు గోపారం గోవిందరాజులు నుంచి తనకు ప్రాణహాని ఉందని...నన్ను అంతమొందించేందుకు నాపై హత్యకు యత్నించాడని ఆర్యవైశ్య సంఘం తాలూకా అధ్యక్షుడు జయం విశ్వనాథ్ వాపోయారు. స్థానిక వాసవీ కళ్యాణ మండపం ఆవరణలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 2020లో ఏర్పాటు చేసిన కమిటీలో ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడిగా గోపారం గోవిందరాజులును ఎన్నుకున్నామన్నారు. ఆలయానికి వచ్చే ఆర్యవైశ్యులను, మహిళలను దూర్భాషలాడడంతోపాటు సంఘానికి సంబంధించిన రూ.7.50 లక్షలను, తిరిగి ఇవ్వమని అడిగితే డబ్బులు లేవంటూ దాట వేస్తూ వచ్చాడన్నారు. అందుకే అతన్ని పదవి నుంచి తొలగించామన్నారు. అప్పటి నుంచి కక్ష పెంచుకుని గత గురువారం ఇనుప రాడ్‌తో నాపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడని వాపోయారు. ఆలయ షాపింగ్ కాంప్లెక్స్‌పై ఉన్న గోవిందరాజులు వెంటనే ఖాళీ చేయించాలని తీర్మానించామన్నారు. అనంతరం షెడ్డును తొలగించేందుకు ఆర్యవైశ్యులు భవనంపైకి ఎక్కేందుకు యత్నించడంతో గోవిందరాజులు కుటుంబ సభ్యులు 100 పోలీసు టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఆలయ సముదాయంలో ఉన్న గోవిందరాజులు వెంటనే ఖాళీ చేయకపోతే తాము నిరాహార దీక్షకు దిగుతానని జయం విశ్వనాథ్ స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు జయం ఫణి, సుబ్రమణ్యం, సుకుమార్ గుప్తా, ఆదిశేషు, బీకే గోపి, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జలధికి తరలిన పీర్లు



కూడేరు: జలధికి తరలిస్తున్న పీర్లు



గుమ్మఘట్ట: కలుగోడులో ఊరేగుతున్న పీర్లు



బ్రహ్మసముద్రం: జలధికి తరలుతున్న పీర్లు

బ్రహ్మసముద్రం: మండలంలోని చెలిమేపల్లి లో చిన్న పీర్ల పండుగ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు జలధి సందర్భంగా పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేశాయి. అనంతరం పీర్లను జలధికి తరలించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

కూడేరు: చిన్న మొహర్రం వేడుకలు కూడేరు, అరవకూరు గ్రామాల్లో ఆదివారం ఘనంగా ముగిశాయి. వేకువ జామున పీర్ల దేవుళ్లు అగ్ని గుండ ప్రవేశం చేశాయి. సాయంత్రం పీర్ల దేవుళ్లు గుండం చుట్టూ ప్రదక్షణలు చేసిన అనంతరం జలధికి తరలించారు.ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా చిందులు తొక్కారు. ఎస్‌ఐ సత్యనారాయణ సిబ్బందితో కలసి బందోబస్తు నిర్వహించారు.

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు గ్రామంలో కొడి పీర్ల వేడుకలు ఆదివారం ముగిశాయి. పీర్లను గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఊరేగించగా భక్తులు చక్కెర, బెల్లం చదివించి మొక్కులు తీర్చుకున్నారు. అగ్నిగుండం చుట్టూ యువకులు చిందులు వేశారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు. సాయంత్రం పీర్లను వేదావతి హగరిలోకి జలధికి తీసుకెళ్లారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి





తిమ్మప్ప భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి దంపతులు, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి భర్త రైస్‌మిల్లు తిమ్మప్ప (70) శనివారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. అజాత శత్రువుగా పేరుపొందిన తిమ్మప్ప మృతి చెందడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులతోపాటు రైస్‌మిల్లు వ్యాపారులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మరణం ఎంతగానో కలిచివేసిందని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం సతిమణి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతితో కలిసి తిమ్మప్ప భౌతాకకాయానికి పూలమాలలేసి నివాళులర్పించారు. జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, కుమారుడు మధు, కూతుళ్లను పరామర్శించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్ పర్సన్ ఉషారాణి, కోకుర్తి జయరామిరెడ్డి, సర్పంచులు ఫణీంద్రగౌడ్, భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ వన్నూరుషా, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మాబుపీరా, కణేకల్లు వైస్ సర్పంచు నబీషా, కోఆప్షన్ సభ్యులు చిన్న సర్మాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ సోమన్న, హనుమంతరావు, మక్బూల్ తదితరులు నివాళులర్పించారు.

ఘనంగా పీరాషావలి షంషీర్ ఊరేగింపు



అశ్వంపై షంషీర్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

కణేకల్లు: మండలంలోని యర్రగుంటలో పీరాషావలి ఉరుసు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాను విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆదివారం వేకువజామున హజరత్ పీరాషావలి ప్రతిరూపంగా భావించే షంషీర్‌ను మేళాతాళాల నడుమ అశ్వంపై ఊరేగించారు. వేడుకలకు రాయదుర్గం, బళ్లారి, ఉరవకొండ, మొలకాల్మూరు, రాంపు రం, బొమ్మనహాళ్, కళ్యాణదుర్గం తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు దర్గాలో చక్కెర చదివించారు. మరికొందరు చక్కెరతో తులాభారం చేసి మొక్కుబడులను తీర్చుకున్నారు. అనంతరం జియారత్‌తో వేడుకలు ముగిశాయి.

క్రైం సమాచారం

మామపై అల్లుడి దాడి

కళ్యాణదుర్గం: కుందుర్పి మండలం ఎనుములదొడ్డి గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ వడ్డే శ్రీరాములుపై అల్లుడు యోగేష్ దాడి చేశాడు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. శ్రీరాములు కుమార్తె శిల్పను అదే గ్రామానికి చెందిన యోగేష్‌కు ఇచ్చి వివాహం జరిపించాడు. అయితే కుమార్తెను సరిగా చూసుకోవడం లేదని అల్లుడిని మందలించడంతో .. కోపోద్రోక్తుడైన యోగేష్ మామపై దాడి చేశాడు. స్వల్పంగా గాయపడిన శ్రీరాములును కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడికి గాయాలు

కూడేరు: మండలంలోని అరవకూరు వద్ద ఆదివారం అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై జరిగిన ప్రమాదంలో తల్లీకుమారుడు నాగమ్మ, వెంకటన్న తీవ్రంగా గాయపడ్డారు. సంచార జాతికి చెందిన వీరు ద్విచక్రవాహనంలో కూడేరు నుంచి అనంతపురం వెళ్తూఆగి ఉన్న ఐచర్ వాహనాన్ని ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాగమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: బ్రహ్మసముద్రం మండలం ముద్దలాపురానికి చెందిన వివాహిత మారెక్క ఆదివారం ఆత్మహత్యకు యత్నించింది.వివరాలు.. తరచూ ఆమె కడుపునొప్పితో బాధపడుతుండేది. ఆదివారం కడుపునొప్పి తీవ్రమవడంతో ఇంట్లో ఎవరులేని సమయంలో బీపీ మాత్రలు ఎక్కువగా మింగింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కళ్యాణదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మహిళకు పాము కాటు

కళ్యాణదుర్గం: శెట్టూరు మండలంలోని ములకలేడు గ్రామానికి చెందిన తిప్పమ్మ పాటు కాటుకు గురైంది. ఈ ఘటన ఆదివారం జరిగింది. పొలం పనులకు వెళ్లిన ఆమెను పింజిరి పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడి వైద్యుల సూచన మేరకు అనంతపురం తరలించారు.

మహిళపై దాడి

కళ్యాణదుర్గం రూరల్: చిన్నపాటి వివాదంతో మహిళపై దాడి జరిగింది. ఈ సంఘటన కంబదూరులో ఆదివారం చోటు చేసుకుంది. మండల కేంద్రంలో నివాసముంటున్న లక్ష్మీదేవిపై అనందమ్మ, రమేష్ దాడిచేసి గాయపరిచారు. స్పృహ కోల్పోయిన ఆమెను కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాలే లక్ష్యంగా చోరీలు



చదం ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ పగులగొట్టిన దృశ్యం

రాయదుర్గం రూరల్: ఆలయాలే లక్ష్యంగా జరుగుతున్న వరుస చోరీలతో మండలవాసులు బెంబేలెత్తుతున్నారు. నెల వ్యవధిలోనే మూడు గ్రామాల్లోని ప్రసిద్ధ ఆలయాల్లో చోరీలు జరిగాయి. గత నెల 25న మండలంలోని మెచ్చిరి ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ పగులగొట్టి రూ.75 వేలు చోరీ జరిగిన విషయం విదితమే. ఆ ఘటనను మరవక ముందే ఈ నెల 5న మండలంలోని మల్లాపురం పరిసరాల్లో ఉన్న చౌడేశ్వరీ దేవి ఆలయంలో సీసీ కెమెరాలు, డీవీఆర్ ధ్వంసం చేయడంతో పాటు హుండీ పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. అయితే నాలుగు నెలల క్రితమే మాన్యం వేలం అనంతరం హుండీలోని కానుకలను లెక్కించి బ్యాంకు ఖాతాలో జమచేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నాలుగు నెలల నుంచి వచ్చిన హుండీ ఆదాయం రూ.6 వేల దాకా ఉండవచ్చన్నారు. గ్రిల్ తలుపులకున్న తాళం పగులగొట్టి సీసీ కెమెరాలు, డీవీఆర్ ధ్వంసం చేశారన్నారు. అదేరోజు మండలంలోని చదం గ్రామంలో ప్రసిద్ధి చెందిన ఆంజనేయ స్వామి ఆలయంలోకి చొరబడిన దొంగలు గ్రిల్ తాళం పగులగొట్టి , హుండీని సైతం ఇనుపచువ్వలతో తొలగించి చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. హుండీలో రూ.15 వేల దాకా ఉండవచ్చన్నారు. వరుస చోరీలకు పాల్పడుతున్న దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆటో బోల్తా.. ఒకరి మృతి

- ఆరుగురికి గాయాలు



మృతి చెందిన కొత్తపల్లి శ్రీనివాసులు (ఫైల్)

ఉరవకొండ: వజ్రకరూరు సమీపంలోని మారెమ్మ ఆలయం సమీపంలో ఆదివారం ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు దుర్మరణం చెందగా, మరో ఆరుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఉరవకొండ పట్టణానికి చెందిన వినాయక ఉత్సవ సమితి తరపున వచ్చే నెలలో వినాయక చవితి ఉండటంతో ముందస్తుగా వినాయకుడి విగ్రహానికి ఆర్డర్ ఇవ్వడానికి ఉరవకొండ పట్టణానికి చెందిన ఏడుగురు వ్యక్తులు ఆటోలో గుంతకల్లుకు బయలుదేరారు. గుంతకల్లులో వినాయకుడి విగ్రహాన్ని ఆర్డర్ ఇచ్చి తిరుగు ప్రయాణం అయ్యారు. వజ్రకరూరు సమీపంలో మారెమ్మ ఆలయం వద్ద ఆటో బోల్తా పడింది. ఈఘటనలో కొత్తపల్లి శ్రీనివాసులతో పాటు శివ, వేణు, ధన, నరసింహ, శరత్‌కు గాయాలు అయ్యాయి. వీరిని 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇందులో కొత్తపల్లి శ్రీనివాసులు(33)కు తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మిగితా యువకులకు వైద్యులు చికిత్స అందించారు. మృతుడు కొత్తపల్లి శ్రీనివాసులు ఉరవకొండ పట్టణంలోని మార్కెండేయస్వామి ఆలయం వద్ద నివాసం ఉంటున్నాడు. ఇతడు కణేకల్లు లోని పంప్‌హౌస్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడని, ఇతనికి భార్య భారతితో పాటు ఏడాది వయసున్న కొడుకు ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జేసీఎస్ మండల కన్వీనర్‌కు గాయాలు

వజ్రకరూరు: మండలంలోని గూళ్యపాళ్యం గ్రామ పరిసర ప్రాంతంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో జేసీఎస్ మండల కన్వీనర్ పి.రాచన్నగౌడ్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు..గూళ్యపాళ్యం నుంచి ఆయన ద్విచక్రవాహనంలో గుంతకల్లుకు వెళ్తుండగా మార్గమధ్యంలో కిందపడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. అటువైపుగా వెళుతున్న వారు వెంటనే 108 వాహనంలో గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యపరీక్షల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.అయితే ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందకు పడ్డాడా లేక వేరే వాహనం ఢీ కొట్టిందా అన్నది తేలాల్సి ఉంది. విషయం తెలుసుకున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఫోన్ చేసి కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనంతపురంలోని వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు.

తాగునీరు కలుషితం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 17వ వార్డు అజాద్ స్కూల్ వద్ద కలుషిత నీటి సమస్యతో కాలనీవాసులు పరేషాన్ అవుతున్నారు. 30–40 గృహాలకు కలుషిత నీరు సరఫరా అవుతున్నట్లు వాపోయారు. అధికారులు స్పందించి పైప్‌లైన్ మార్పు చేసి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు.

రహదారి సమస్య పరిష్కారం



గతంలో అధ్వానంగా ఉన్న రహదారి



పూర్తయిన తారు రోడ్డు

రాయదుర్గంటౌన్: దశాబ్దాలుగా (దాదాపు 40 ఏళ్లు) రాకపోకలు సాగిస్తున్న ఓ అధ్వాన్నమైన, వర్షం వస్తే అడుగుపెట్టేందుకు వీలులేని రోడ్డుకు మోక్షం లభించింది. పట్టణంలోని 31వ వార్డు పరిధిలో బళ్లారి రోడ్డును కలుపుతూ పార్కు పక్కన నుంచి పెద్ద బన్నీ మహంకాళి ఆలయంతో పాటు సిద్దేశ్వర కాలనీ, ఇతర కాలనీలకు వెళ్లే ప్రధాన రోడ్డు రాకపోకలకు తీవ్ర అధ్వానంగా ఉండేది. 40 ఏళ్ల క్రితం వేసిన తారు రోడ్డు ఆనవాళ్లు లేకుండా కంకరతేలి అభివృద్ధిని ప్రశ్నిస్తుండేది. వర్షం వస్తే పరిస్థితి మరింత భయంకరంగా మారి రాకపోకలకు బంద్ అయ్యేవి. ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తులు రోడ్డు దుస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేసేవారు. ఎందరు మున్సిపల్ పాలకులు మారినా.. సీసీ రోడ్డుకు నోచుకోలేదు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో ఎమ్మెల్యే గ్రాంటు(సీఎండీఎఫ్) నిధులను కేటాయించడంతో ఇటీవల రూ.10 లక్షలతో సీసీ రోడ్డు వేశారు.దీంతో స్థానికులు, భక్తులు, ఆలయ కమిటీ నిర్వాహకులు, పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. విప్‌తోపాటు మున్సిపల్ పాలకవర్గానికి, వార్డు కౌన్సిలర్ తాడూరు భాగ్య, వార్డు ఇన్‌చార్జ్ కృష్ణమూర్తి, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.